గుజరాత్ కెప్టెన్‌గా గిల్

● ముంబైకి హార్దిక్ పాండ్యా

న్యూఢిల్లీ: రానున్న ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా..గుజరాత్ నుంచి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి మారిన నేపథ్యంలో గిల్‌ను కెప్టెన్సీ వరించింది. గత రెండు సీజన్లు గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహించిన హార్దిక్ తొలి సీజన్‌లోనే జట్టును విజేతగా నిలిపాడు. అయితే ప్లేయర్ల బదిలీల నేపథ్యంలో పాండ్యాను ముంబై ఫ్రాంచైజీ తమ జట్టులోకి తీసుకుంది. తనను కెప్టెన్‌గా ఎంపిక చేయడంపై గిల్ స్పందిస్తూ 'గుజరాత్‌కు నాయకత్వాన్ని వహించడాన్ని గర్వంగా ఫీలవుతున్నాను. నాపై నమ్మకం ఉంచుతూ ఈ బాధ్యతలు అప్పగించిన జట్టు యాజమాన్యానికి కృతజ్ఞతలు. గత రెండు సీజన్లలో అద్భుతమైన ఫలితాలు సాధించాం. రానున్న రోజుల్లో జట్టును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను' అని అన్నాడు. మరోవైపు పాండ్యా ఎక్స్(ట్విటర్)లో స్పందిస్తూ 'తిరిగి ముంబై జట్టులోకి రావడం ఆనందంగా ఉంది. ముంబై, వాంఖడే, పల్టాన్ మరిచిపోలేని అనుభూతులు' అని రాసుకొచ్చాడు.

రోహిత్ సెంచరీ

హైదరాబాద్‌కు తొలి ఓటమి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: విజయ్ హజారే వన్డే టోర్నీలో హైదరాబాద్‌కు తొలి ఓటమి ఎదురైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో చత్తీస్‌గఢ్ చేతిలో ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్.. ఓపెనర్ రోహిత్ రాయుడు(102) సెంచరీతో నిర్ణీత 50 ఓవర్లలో 271/9 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (49) ఆకట్టుకున్నాడు. జివేశ్ (3/41), శాశంక్‌సింగ్(3/69) మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన చత్తీస్‌గఢ్ 48.1 ఓవర్లలో 273/4 స్కోరు చేసింది. రిషబ్ తివారీ (65), సంజీత్ దేశాయ్(47) జట్టు విజయంలో కీలకమయ్యారు. కార్తీకేయ(2/35) రెండు వికెట్లు తీశాడు. హైదరాబాద్ ఓటమితో రోహిత్ సెంచరీ వృథా అయ్యింది.

వీధుల నుంచి స్టేడియానికి..

ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ఆవిష్కరణ

ముంబై: క్రికెట్ ఉత్సాహాన్ని వీధుల నుంచి స్టేడియానికి తీసుకొచ్చేందుకు మరో లీగ్ మన ముందుకు రాబోతున్నది. సీసీఎల్ స్పోర్ట్స్ ఎల్ఎలపీ భారత్‌లో తొలిసారిగా ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్(ఐఎస్‌పీఎల్) ప్రారంభించింది. అరంగేట్రం సీజన్ మార్చి 2, 2024 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, శ్రీనగర్ ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఈ లీగ్ ద్వారా ప్రతిభ కల్గిన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురానున్నారు. జాతీయ వేదికపై వారి ప్రదర్శన సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. లీగ్ ఆవిష్కరణ కార్యక్రమంలో భారత మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి, అశిష్ షెలార్, అమోల్ కాలే తదితరులు పాల్గొన్నారు.

సాగర్, సచిన్ ముందంజ

షిల్లాంగ్ : పురుషుల జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కామన్వెల్త్ క్రీడల రజత పతక విజేత సాగర్, ప్రపంచ యూత్ చాంపియన్ సచిన్ ముందంజవేశారు. రైల్వేస్‌కు చెందిన సాగర్ 92ప్లస్ విభాగంలో చెమట చిందించకుండానే తొలి రౌండ్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన శుభం సింగ్‌ను చిత్తుచేశాడు. సాగర్ పంచ్‌లకు ప్రత్యర్థి నిలదొక్కుకోలేకపోవడంతో రెఫరీ మధ్యలోనే మ్యాచ్‌ను నిలిపివేసి సాగర్‌ను విజేతగా ప్రకటించాడు. 57 కిలోల విభాగంలో సర్వీసెస్‌కు చెందిన సచిన్ 5-0తో పంజాబ్‌కు చెందిన విశాల్ కుమార్‌పై గెలుపొందాడు. 63.5 కిలోల విభాగంలో వంశజ్, 60 కిలోల విభాగంలో వరిందర్ సింగ్ 5-0తో ప్రత్యర్థులపై గెలుపొంది ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. మొత్తం 13 విభాగాలలో వివిధ రాష్ట్రాలనుంచి 350మందికిపైగా బాక్సర్లు పోటీపడుతున్నారు.

సిరీస్‌పై నజర్

జోరుమీదున్న భారత్

పుంజుకునేందుకు ఆసీస్ తహతహ

నేడు మూడో టీ20 మ్యాచ్

పొట్టి ఫార్మాట్‌లో భారత్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. ప్రపంచకప్ ఓటమి నుంచి త్వరగానే తేరుకున్న టీమ్‌ఇండియా..ఆస్ట్రేలియాను చిత్తుచేస్తూ ముందుకు సాగుతున్నది. విశాఖపట్నం, తిరువనంతపురంలో అద్భుత విజయాలు సొంతం చేసుకున్న సూర్యకుమార్ సేన.. గువాహటిలో పోరుకు సిద్ధమైంది. నేడు జరిగే మూడో టీ20లోనూ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలని చూస్తున్నది. యువకులతో కళకళలాడుతన్న టీమ్‌ఇండియా.. ఇదే జోరు కొనసాగిస్తూ కంగారూలకు షాక్ ఇవ్వాలన్న తలంపుతో ఉంది. గెలిస్తే గానీ నిలువని పరిస్థితుల్లో ఉన్న ఆసీస్.. దీటైన పోటీనిచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. ఇద్దరి మధ్య పోరు మరోమారు అభిమానులను అలరించడం ఖాయంగా కనిపిస్తున్నది.

7 నుంచి స్పోర్ట్స్ 18లో

గువాహటి: వచ్చే ఏడాది జరిగే ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ కోసం భారత్ పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నది. మెగాటోర్నీ నాటికి మిగిలిన మ్యాచ్‌లను దృష్టిలో పెట్టుకుని కుర్రాళ్లకు అవకాశమిస్తూ పోతున్నది. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలో బరిలోకి దిగిన భారత్..ఆస్ట్రేలియాను దీటుగా ఎదుర్కొంటున్నది. వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుంటూ కుర్రాళ్లు వీరవిహారం చేస్తున్నారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, రింకూసింగ్ దుమ్మురేపుతున్నారు. ఆసీస్ బౌలింగ్ దాడిని తిప్పికొడుతూ పరుగుల వరద పారిస్తున్నారు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో బ్యాట్లు ఝుళిపిస్తున్నారు. ఇదిలా ఉంటే యువ బ్యాటర్ తిలక్‌వర్మ ఫామ్ ఒకింత ఆందోళన కల్గిస్తున్నది. గత రెండు మ్యాచ్‌ల్లో తిలక్ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయాడు. చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయాస్ అయ్యర్ రానుండటంతో తిలక్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు కనిపించడం లేదు. బౌలర్లు సమిష్టిగా రాణిస్తుండటం భారత్‌కు కలిసి వస్తున్నది.

పుంజుకునేందుకు:
వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆసీస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నది. మ్యాక్స్‌వెల్, స్మిత్, జంపా, స్టాయినిస్ లాంటి సీనియర్ క్రికెటర్లు ఉన్నా..ఆసీస్ గెలుపు బాట పట్టలేకపోతున్నది. సిరీస్‌లో నిలువాలంటే కంగారూలు తప్పక గెలువాల్సిన పరిస్థితిని ప్రస్తుతం ఎదుర్కొంటున్నారు.

60 అంతర్జాతీయ టీ20ల్లో రెండు వేల పరుగుల మార్క్ అందుకోవడానికి సూర్యకుమార్ మరో 60 పరుగుల దూరంలో ఉన్నాడు.

జట్ల అంచనా

భారత్: యశస్వి, రుతురాజ్, ఇషాన్‌కిషన్, సూర్యకుమార్(కెప్టెన్), తిలక్‌వర్మ, రింకూ సింగ్, అక్షర్‌పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ముకేశ్ కుమార్

ఆస్ట్రేలియా: స్మిత్, షార్ట్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టాయినిస్, డేవిడ్, వేడ్(కెప్టెన్), జంపా, ఎలిస్, బెహెన్‌డార్ఫ్/అబాట్, తన్వీర్

ఉప్పల్ స్టేడియం కొత్త హంగులు అద్దుకుంది. ఇటీవలే ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యమిచ్చిన స్టేడియాన్ని మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్టాండ్లకు పైకప్పు అమర్చుతూ కొత్త కుర్చీలు ఏర్పాటు చేయడం అందాన్నిచ్చింది.

ఒడిశాలో ఖోఖో లీగ్

న్యూఢిల్లీ: అల్టిమేట్ ఖో ఖో లీగ్(యూకేకే) రెండో సీజన్ మ్యాచ్‌లకు రంగం సిద్ధమైంది. ఒడిశా వేదికగా వచ్చే నెల 24వ తేదీన మొదలై జనవరి 13 వరకు జరుగనున్నాయి. కటక్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. భవిష్యత్ కోసం యువత అనే దార్శనికతతో స్ఫూర్తి పొందిన ఒడిశా ప్రభుత్వం పలు ప్రతిష్ఠాత్మక టోర్నీలకు వేదికగా నిలుస్తున్నది. ఔత్సాహిక క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

నిర్భయంగా ఆడుతున్నా

తిరువనంతపురం : స్వేచ్ఛగా ఆడేందుకు అవకాశం ఇవ్వడంతో తనకు తెలిసిన అన్ని షాట్లను ప్రదర్శిస్తున్నానని, నిర్భయంగా ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొని పరుగులు రాబడుతున్నానని టీమ్‌ఇండియా ఓపెనర్ జైస్వాల్ తెలిపాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20ల్లో యశస్వి 25 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 53 పరుగులు సాధించి, రుతురాజ్‌తో కలిసి తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించిన వైనమే యశస్వి తీరుకు నిదర్శనంగా నిలుస్తున్నది.

టైటిల్ పోరుకు పంజాబ్, హర్యానా

చెన్నై : భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో రాణించడంతో సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ జట్టు 5-1తో కర్ణాటకపై గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకుంది. పంజాబ్‌కు హర్మన్‌ప్రీత్ సింగ్(39ని., 44ని.), షంషేర్ సింగ్(4ని.), సుఖజీత్ సింగ్(13ని.), అకాశ్‌దీప్ సింగ్(45ని.) గోల్స్ సాధించగా, అభిరాన్ సుదేవ్(18ని.) కర్ణాకటకు ఏకైక గోల్‌ను సాధించిపెట్టాడు. పంజాబ్ ఫైనల్లో హర్యానాను ఢీకొంటుంది. రెండో సెమీఫైనల్లో హర్యానా షూటౌట్‌ద్వారా నిర్వాహక తమిళనాడు జట్టుపై గెలుపొందింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలువడంతో జరిగిన షూటౌట్‌లో హర్యానా 4-2 తేడాతో విజయం సాధించింది.

డేవిస్‌కప్ విజేత ఇటలీ

మలగ(ఇటలీ) : టెన్నిస్ పురుషుల టీమ్ చాంపియన్‌షిప్‌గా భావించే డేవిస్‌కప్‌ను ఈ యేడాది ఇటలీ గెలుచుకున్నది. ఆదివారం జానిక్ సిన్నర్ రెండో సింగిల్స్ మ్యాచ్‌ను గెలవగానే ఇటలీ విజేతగా నిలిచింది. ఈ వారంలో తాను ఆడిన అయిదు మ్యాచ్‌లలో ఓటమి ఎరుగని సిన్నర్, సెమీస్‌లో సెర్బియాతో మ్యాచ్‌లో టాప్ ర్యాంకర్ జొకోవిచ్‌ను ఓడించి జట్టును ఫైనల్‌కు చేర్చడంలో ప్రధానపాత్ర వహించాడు. ఫైనల్స్ తొలి సింగిల్స్‌లో మాటియో ఆర్నాల్డ్ 7-5, 2-6చ 6-4తో అలెక్సీ పొపిరిన్‌పై గెలుపొంది శుభారంభం అందించగా, సిన్నర్ 6-3, 6-0తో అలెక్స్ డిమినార్‌ను ఓడించి అయిదు దశాబ్దాల తరువాత ఇటలీకి డేవిస్‌కప్‌ను అందించాడు. చివరిసారిగా ఇటలీ 1976లో డేవిస్‌కప్‌ను గెలుచుకున్నది. వచ్చే యేడాదికూడా డేవిస్‌కప్ ఫైనల్స్‌ను మలగలోనే నిర్వహించాలని నిర్ణయించారు.

కార్ల ధరలకు రెక్కలు!

జనవరి నుంచి పెంచుతున్న మారుతి, మహీంద్రా, టాటా, ఆడీ

న్యూఢిల్లీ, నవంబర్ 27: కొత్త కారును కొనుగోలు చేయాలనుకుంటున్నారా..అయితే మీ జేబుకు చిల్లులు పడబోతున్నాయి. ఇప్పటికే పలుమార్లు ధరలను పెంచిన వాహన సంస్థలు మరోసారి పెంచడానికి సమాయత్తమవుతున్నాయి. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ, లగ్జరీ కార్ల సంస్థ ఆడీతోపాటు టాటా మోటర్స్ కూడా తన మాడళ్ల ధరలను సవరిస్తున్నట్టు తాజాగా ప్రకటించాయి. కమోడిటీ ఉత్పత్తుల ధరలు అధికమవడం, ద్రవ్యోల్బణ పెరగడంతో ధరలపై తీవ్ర ఒత్తిడి పడిందని, దీంతో ధరలు పెంచకతప్పడం లేదని మారుతి వర్గాలు వెల్లడించాయి. ఎంత శాతం మేర పెంచేదానిపై సంస్థ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ప్రస్తుతం సంస్థ రూ.3.54 లక్షల నుంచి రూ.28.42 లక్షల లోపు విక్రయిస్తున్నది.

ఆడీ రెండు శాతం వడ్డన

ఆడీ కూడా తన వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం అధికంకావడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే జనవరి 1 నుంచి అన్ని మాడళ్ల విలువలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు తెలిపింది. సరఫరా కోసం అయ్యే ఖర్చులు అధికమవడం, మరోవైపు ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్లను ఆయా మాడళ్ల ధరలను సవరించాల్సి వచ్చిందని ఆడీ ఇండియా హెడ్ బాల్బిర్ సింగ్ ధిల్లాన్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం సంస్థ రూ.42.77 లక్షల నుంచి రూ.2.22 కోట్ల లోపు పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

టాటా మోటర్స్ కూడా..

టాటా మోటర్స్ కూడా తన వాహన ధరలను పెంచేందుకు సమాయత్తమవుతున్నది. జనవరి నుంచి అమలులోకి వచ్చేలా ప్యాసింజర్, ఎలక్ట్రిక్ వాహన ధరలను సవరించాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ రూ.5.6 లక్షల నుంచి రూ.25.94 లక్షల లోపు వాహనాలను దేశీయంగా విక్రయిస్తున్నది. ఈ ధరలను ఎంతమేర పెంచబోతున్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

మహీంద్రా, బెంజ్ కూడా..

దేశీయ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా కూడా వాహన ధరలు పెంచడానికి సిద్ధమవుతున్నది. ద్రవ్యోల్బణం, కమోడిటీ ధరల ఆధారంగా ధరలను పెంచకతప్పడం లేదని మహీంద్రా సీఈవో నలినికాంత్ గొల్లగుంట తెలిపారు. ఎంతమేర పెంచేది మాత్రం వచ్చే నెల చివర్లో వెల్లడించనున్నది సంస్థ. అలాగే మరో లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కూడా ధరల పెంపుపై ఆలోచిస్తుమంటున్నట్లు పేర్కొంది.

లగ్జరీ హోమ్ @హైదరాబాద్

నగరంలో భారీగా పెరిగిన రూ.4 కోట్ల ధర కలిగిన ఇండ్ల అమ్మకాలు

దేశవ్యాప్తంగా టాప్-3లో చోటు.. ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్‌పై సీబీఆర్‌ఈ నివేదిక

హైదరాబాద్, నవంబర్ 27: ఇండ్ల కొనుగోలుదారుల అభిరుచి మారుతున్నది. ఈ క్రమంలోనే బడ్జెట్ హౌజ్‌ల నుంచి లగ్జరీ హోమ్‌ల వైపు కదులుతున్నారు. దేశవ్యాప్తంగా 97 శాతం పెరిగిన లగ్జరీ ఇండ్ల అమ్మకాలే ఇందుకు నిదర్శనం. హైదరాబాద్‌సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్‌లో రూ.4 కోట్లకుపైగా విలువైన ఇండ్ల అమ్మకాలపై ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సీబీఆర్‌ఈ ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో టాప్-3లో హైదరాబాద్‌కు చోటు దక్కగా.. మొత్తం విక్రయాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్‌ల వాటానే 90 శాతం ఉండటం విశేషమని సోమవారం ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థతో సీబీఆర్‌ఈ అన్నది.

దాదాపు రెట్టింపు

హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా నగరాల్లో లగ్జరీ ఇండ్ల సేల్స్‌పై 'ఇండియా మార్కెట్ మానిటర్ క్యూ3 2023' పేరుతో సీబీఆర్‌ఈ ఓ రిపోర్టు ఇచ్చింది. గత ఏడాది జనవరి-సెప్టెంబర్‌లో ఈ 7 నగరాల్లో 4,689 లగ్జరీ నివాసాలు అమ్ముడయ్యాయి. అయితే ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్‌లో 9,246 యూనిట్లుగా నమోదయ్యాయి. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ వాటానే 37 శాతంగా ఉండగా, ఇక్కడ ఈసారి 3,400 ఇండ్ల అమ్మకాలు జరిగినట్టు సీబీఆర్‌ఈ పేర్కొన్నది. రెండో స్థానంలో ముంబై (35 శాతం), మూడో స్థానంలో హైదరాబాద్ (18 శాతం) నిలిచాయి. పుణెలో 4 శాతం విక్రయాలు నమోదవగా.. బెంగళూరు, చెన్నై, కోల్‌కతా నగరాలు ఆ తర్వాతి స్థానాలతో సరిపెట్టుకున్నాయి.

- ❖ లగ్జరీ ఇండ్ల అమ్మకాలకు దోహదం చేసిన బలమైన ఆర్థిక పరిస్థితులు, ముఖ్యంగా పెరిగిన మెట్రో నగరాల ప్రజల ఆదాయం-జీవన ప్రమాణాలు
- ❖ అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల మధ్య దేశంలో తమ పెట్టుబడుల రక్షణ కోసం లగ్జరీ ఇండ్ల కొనుగోళ్లకే ఆసక్తి చూపుతున్న హెచ్‌ఎన్‌ఐ (అపర కుబేరులు), ఎన్నారై (ప్రవాస భారతీయులు)లు
- ❖ ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో దేశంలోని 7 ప్రధాన నగరాల్లో 1.5 లక్షల యూనిట్లకు లగ్జరీ హోమ్ సేల్స్. నిరుడు ఇదే వ్యవధిలో 1.47 లక్షలే. 2021 జనవరి-జూన్‌లో 1.14 లక్షలుగా నమోదు
- ❖ ఈ ఏడాది పదేండ్ల గరిష్ఠానికి ప్రీమియం, లగ్జరీ హౌజింగ్ ప్రాజెక్టుల ప్రారంభాలు

> ఈ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో దేశీయ మెట్రో నగరాల్లో లగ్జరీ ఇండ్లకు ఇంకా గిరాకీ పెరుగుతుందనే అంచనా వేస్తున్నాం. పండుగ సీజన్, సేల్స్‌ను పెంచుకోవడానికి డెవలపర్లు ఇచ్చే ఆఫర్లు, గృహ రుణాలపై స్థిరంగా ఉన్న వడ్డీరేట్లు కలిసిరావచ్చు.
>
> **-అన్నుమన్ మ్యాగజైన్, సీబీఆర్‌ఈ చైర్మన్**

వాణిజ్య

వృద్ధి 6.4 శాతం

● ఎస్ అండ్ పీ అంచనా

న్యూఢిల్లీ, నవంబర్ 27: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ 6.4 శాతం వృద్ధిచెందుతుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ అంచనా వేసింది. గతంలో ప్రకటించిన 6 శాతం అంచనాను తాజాగా పెంచింది. అయితే వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాల్ని 6.9 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం వృద్ధిచెందగా, ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. ప్రస్తుతం అధిక ఆహార ధరలతో పాటు ఎగుమతులు బలహీనంగా ఉన్నప్పటికీ, దేశీయ డిమాండ్ కారణంగా 2023-24 వృద్ధి రేటును పెంచుతున్నామని, అంతర్జాతీయ వృద్ధి మాంద్యం, అధిక వడ్డీ రేట్ల ప్రభావం కొంత ఆలస్యంగా వ్యాపించనున్నందున వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాల్ని తగ్గిస్తున్నామని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ సోమవారం ఒక నివేదికలో వివరించింది. ఇతర గ్లోబల్ ఏజెన్సీలు ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, ఫిచ్‌లు భారత్ వృద్ధి రేటు 2023-24లో 6.3 శాతం ఉంటుందని భావిస్తుండగా, ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో 6.5 శాతం చొప్పున జీడీపీ వృద్ధిచెందుతుందని రిజర్వ్‌బ్యాంక్ అంచనాల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే.

సెంబ్‌కార్ప్ చేతికి 428 మె.వా పవన విద్యుత్

న్యూఢిల్లీ, నవంబర్ 27: భారత్‌తో పాటు చైనాల్లో 428 మెగావాట్ల పవన విద్యుత్‌ను కొనుగోలు చేసినట్టు సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఇందుకోసం 200 మిలియన్ సింగపూర్ డాలర్(రూ.1,247 కోట్లు)తో హస్తగతం చేసుకున్నది. సింగపూర్‌కు చెందిన ఎనర్జీ సంస్థ వెనుకుండి టీమ్‌సీక్ హోల్డింగ్స్. 12 ఏండ్లకు పైగా దేశీయంగా సేవలు అందిస్తున్న సంస్థకు 18 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. దీంతో కంపెనీ మొత్తం విద్యుత్ ఉత్పత్తి 3.7 గిగావాట్లకు చేరుకోనున్నది.

మన ఎయిర్ ట్రాఫిక్ భళా..

- ● ప్రయాణికుల రాకపోకల్లో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు రికార్డు
- ● ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో కోటీ 20 లక్షలపైనే
- ● గత ఏడాదితో పోల్చితే 24% వృద్ధి

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): జీఎమ్మార్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీహెచ్‌ఐఏఎల్) ప్రయాణికుల రాకపోకల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. సోమవారం ఆ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2022-23) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)తో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-సెప్టెంబర్‌లో 24 శాతం వృద్ధితో మునుపెన్నడూ లేనివిధంగా ఏకంగా 12 మిలియన్ల (కోటీ 20 లక్షలపైనే) కుపైగా ప్రయాణికులకు విమానయాన సేవలు అందాయి. కాగా, ఇదే సమయంలో దేశం మొత్తం మీద విమాన ప్రయాణికుల రద్దీ 75.4 మిలియన్లుగా ఉన్నట్టు తేలింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా విమానయాన సేవల్లో 3వ అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. ఇక జీహెచ్‌ఐఏఎల్‌లో విమానాల రాకపోకలు (ఎయిర్ ట్రాఫిక్ మూమెంట్స్ లేదా ఏటీఎం) ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగి 42,625గా నమోదయ్యాయి. ఇందులో దేశీయ విమాన సర్వీసులు 35,782, అంతర్జాతీయ విమాన సర్వీసులు 6,843గా ఉన్నాయి.

జూలై-సెప్టెంబర్‌లో..

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది జూలై-సెప్టెంబర్‌లో దేశీయంగా ప్యాసింజర్ ట్రాఫిక్ 24 శాతం, అంతర్జాతీయంగా 23 శాతం పెరిగింది. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో ప్యాసింజర్లు 4.9 మిలియన్లుగా ఉంటే, ఈసారి 6 మిలియన్లకు పైగానే ఉన్నారు. ఒక్క ఈ అక్టోబర్ నెలలోనే దేశీయ ప్రయాణికులు 20 లక్షలుగా ఉన్నారని జీహెచ్‌ఐఏఎల్ తెలియజేసింది. నిరుడు ఇదే నెల 14.8 లక్షలే. అలాగే అక్టోబర్‌లో శంషాబాద్‌లోని ఈ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ ప్రయాణికులు 3 లక్షలుగా నమోదయ్యారు. గత ఏడాది 2 లక్షలే. అక్టోబర్‌లో విమాన సర్వీసులు దేశీయంగా 12,548, అంతర్జాతీయంగా 2,198 ఉన్నాయి. నిరుడుతో పోల్చితే 12 శాతం వృద్ధి ఉన్నది.

- ❖ 80కిపైగా దేశ, విదేశీ గమ్యస్థానాలకు విస్తృతమైన రూట్ నెట్‌వర్క్, కనెక్టివిటీతో దక్షిణ మధ్య భారత్‌లో గేట్‌వే ఆఫ్ ఛాయిస్‌గా పేరొందింది హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. వార్షిక ప్రయాణికుల రద్దీపరంగా 4వ స్థానానికి ఎగిసింది.
- ❖ ఇక కరోనాకు ముందు ఈ ఎయిర్‌పోర్టు నుంచి 55 దేశీయ గమ్యస్థానాలకే విమాన సర్వీసులుండేవి. అయితే ఇప్పుడు 66కు పెరిగాయి. అలాగే 16 నుంచి 19కి అంతర్జాతీయ గమ్యస్థానాలు చేరాయి.
- ❖ దేశంలోని మెట్రో నగరాలను మినహాయిస్తే.. గోవా, విశాఖపట్నం, కొచ్చి, తిరుపతి, అహ్మదాబాద్ లాంటి నగరాలకూ జోరుగా విమానాలు నడుస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ నుంచి 14 ఇంటర్నేషనల్ రూట్లలో ఇండిగో సర్వీసులున్నాయి.
- ❖ వచ్చే ఏడాది జనవరి నుంచి లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్.. హైదరాబాద్, ఫ్రాంక్‌ఫర్ట్ మధ్య విమాన సర్వీసుల్ని నడుపనున్నది. ఇక్కడి నుంచి దేశంలోని టైర్-2, 3 నగరాలకూ సేవలందుతుండటం గమనార్హం.
- ❖ భవిష్యత్తులో ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్య, ఐరోపా దేశాలకూ గేట్‌వేలాగా మారనున్న హైదరాబాద్ ఎయిర్‌పోర్టు
- ❖ ప్రస్తుతం చికాగో, న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, డల్లాస్, మెల్బోర్న్, సిడ్నీ, పారిస్, అమ్‌స్టర్‌డమ్, ఇండోనేషియా, వియత్నాం, కజకిస్థాన్, నేపాల్‌లోని గమ్యస్థానాలకు కనెక్టివిటీని పెంచడంపై జీహెచ్‌ఐఏఎల్ దృష్టి సారించింది.
- ❖ దేశ, విదేశీ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దశల వారీగా ఎయిర్‌పోర్టు విస్తరణ. ఇటీవలే అందుబాటులోకి వచ్చిన 56,474 చదరపు మీటర్ల ఏరియా. దీంతో 2,74,118 చదరపు మీటర్లకు చేరిన మొత్తం వైశాల్యం.
- ❖ వచ్చే ఏడాది మార్చి ఆఖరుకల్లా దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ దాదాపు 155 మిలియన్లకు, అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీ 70 మిలియన్లకు చేరవచ్చని ఏవియేషన్ అడ్వైజరీ సంస్థ క్యాపా అంచనా వేసింది.

ఎలక్ట్రిక్ బస్సులకు పెరుగనున్న డిమండ్

● ఇక్రా రిపోర్ట్